క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన రవాణా శాఖ కమిషనర్



ఎస్పీకి పూల మొక్కను అందజేస్తున్న ఉప రవాణా శాఖ కమిషనర్

ఒంగోలు టౌన్: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్. సుశీల గురువారం ఎస్పీ మలిక గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసిన ఆమె పూల మొక్కను అందజేశారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలి

దర్శి: మండలంలోని రేషన్ షాపుల్లో 2 నెలల నుంచి కందిపప్పు ఇవ్వడం లేదని సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. సీపీఎం ప్రతినిధి బృందంతో కలిసి గురువారం తహసీల్దార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. సీపీఎం దర్శి మండల నాయకులు సందు వెంకటేశ్వరరావు, ఈమని నాగేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి పూజలో మహిళా భక్తులు

ఒంగోలు టౌన్: స్థానిక మిలిటరీ కాలనీ యానాది సంఘం కొత్తడొంకలో వేంచేసి యున్న పోలేరమ్మ కనక దుర్గమ్మ 12 వార్షికోత్సవం వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారి మూలవిరాట్లకు అర్చక స్వాములు రాము శర్మ శ్రీ సూక్తంతో అభిషేకించారు. అనంతరం అమ్మవారికి వివిధ రకాల పూలతో చక్కగా అలంకరించి దేవి ఖడ్గమాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు మంగళ హారతులతో దర్శనం చేసుకొని పొంగళ్లు, చద్ది నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. 33వ డివిజన్ కార్పొరేటర్ భాస్కర్ రెడ్డి నియంత సహాయ సహకారాలతో ఆలయ నిర్వాహకులు నాగుర్ బి. దంపతులు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో శ్రవణా నక్షత్ర పూజలు



శ్రీదేవి భూదేవి సమేత శ్రీగిరి వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు టౌన్: నగరంలోని కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. వేద స్వరూపుడైన స్వామివారికి నాదనీరాజనం సమర్పించారు. చతుర్వేద పారాయణంతో ప్రస్తుతించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్య నిర్వాహక ధర్మకర్త సీవీ రామకృష్ణారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాగా ఈ నెల 8వ తేదీ ఆదివారం ఆదయం 9 గంటలకు స్వామి వారికి సువర్ణ అష్టదళ పద్మ పాదార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దేవస్థానంలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

కిలో పొగాకు ధర రూ.212

ఒంగోలు రూరల్: రూరల్‌లోని పొగాకు వేలం కేంద్రం-2లో పొగాకు గరిష్ట కిలో ధర రూ.212 పలికింది. తుఫాన్లు, వరదల మధ్య ఒక్కో రైతు మూడేసి సార్లు బురద యాత వేసి తీవ్రంగా నష్టపోయిన విషయం పాఠకులకు తెలిసిందే అయినా వారి కష్టాన్ని వమ్ము చేయకుండా పొగాకు మంచి దిగుబడి గ్రేడు లభించింది. గత కొద్ది రోజులుగా రూ.200 వద్ద స్థిరంగా అమ్మకాలు జరిగినా నేడే వేలం కేంద్రంలో గరిష్ట ధర రూ.212 చేరుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వేలం కేంద్రానికి 753 బేళ్ళు రాగా 687 బేళ్ళు కొనుగోళ్ళు జరిగాయి. 23 బేళ్ళు నోబిడ్ బేళ్ళు అయ్యాయి. గరిష్ట ధర రూ.212, కనిష్ట ధర రూ.170, సరాసరి ధర రూ.209.82 గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

సచివాలయాల్లో నిర్దిష్ట వ్యవధిలో సేవలు

లింగసముద్రం: సచివాలయాల్లో లబ్ధిదారులకు నిర్దిష్ట వ్యవధిలో సేవలు అందాలని ఎంపీడీఓ శేషుబాబు అన్నారు. మండలంలోని చినపవని, ముత్యాలపాడు, అన్నెబోయినపల్లె, వీఆర్‌కోట గ్రామ సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. సచివాలయాల్లో ఉద్యోగుల హాజరుపట్టీని, బయోమెట్రిక్‌తో పాటు పలు రికార్డులను పరిశీలించారు.



చుక్కల భూముల చిక్కులు తొలిగాయ్!

- మండలంలో 1,528.91 ఎకరాలకు శాశ్వత పరిష్కారం
- 1,452 మంది రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలినేనికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు
- నేడు భూ హక్కు పత్రాలు పంపిణీ చేయనున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వం చూపింది. ఏడు దశాబ్దాల సమస్యకు ఎట్టికేలకు పరిష్కారం దొరకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం చేయలేని సాహసం వైస్సార్ సీపీ చేయడం విశేషం. మండలంలో 1,528.91 ఎకరాల చుక్కల భూమి ఉండగా 1,452 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. అల్లూరు రెవెన్యూ పరిధిలో 1,125.37 ఎకరాలతో పాటు ఆలూరు 2.33లో ఎకరాలకు 17 మంది రైతులు, పాదర్తిలో 402.21 ఎకరాలకు గాను 362 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. బ్రిటిష్ పరిపాలన నాటి నుంచి ఆర్ఎస్ఆర్‌లో చుక్కల భూములుగా నామకరణ చేశారు. అవి ప్రభుత్వ భూములా? రిజిస్ట్రేషన్ భూములా అని ఎవరికీ అర్థం కాక కాలేదు. కాగా సదరు భూములకు రెవెన్యూ సిబ్బంది పట్టాదారు పాస్‌పుస్తకాలు, అడంగళ్, ఒన్‌బీ ఇవ్వడంతో రైతులు ప్రభుత్వం నుంచి రాయితీలు పొందుతున్నారు. బ్యాంక్‌ల నుంచి పంట లోన్లు, మార్ట్‌గేజ్ నోన్లు కూడా తీసుకున్నారు. అయితే 2017లో ఆన్‌లైన్ కొత్తవిధానం వచ్చిన తర్వాత సదరు భూముల రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీంతో రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బీ, అడంగళ్ జారీ చేయకుండా ఉండటంతో పాటు క్రయ, విక్రయాలు నిలుపుదల చేశారు.

ధర రెట్టింపు

2017లో ఆన్‌లైన్ కొత్త విధానం వచ్చిన తరువాత చుక్కల భూములు ఆన్‌లైన్ కాకపోవడం ధరలు పడిపోయాయి. కొనుగోళ్లు చేసేవారే కరువయ్యారు. నాటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఈ సమస్యను ఆయన దృష్టికి తీసికెళ్లడంతో నాటు హామీ నెరవేర్చారు. 22-ఏ(1) (ఈ) నుంచి నిషేధిత భూముల్లో నుంచి తొలగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ధర రెండు రెట్లు కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన సమస్య పరిష్కారం అయ్యింది



నా నియోజక వర్గంలో కొత్తపట్నం మండలం కీలకమైంది. నేను ఎప్పుడు ఎన్నికల ప్రచారానికి వెళ్లినా, సభలు, సమావేశాలు జరిపినా చుక్కల భూములు సమస్యలు ప్రజలు చెప్పేవారు. రాష్ట్ర పాలసీ కావడంతో నేను ఏమీ చేయలేక పోయాను. ఇప్పుడు వైస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తీసుకున్న నిర్ణయంతో 1,452 మంది రైతులకు, 1,528.91 ఎకరాలకు శాశ్వత పరిష్కారం దొరికింది.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే

నా పొలాన్ని పెండింగ్ పెట్టారు



నాకు ఆపద వచ్చి అమ్ముకోవాలంటే ఆన్‌లైన్ ఉంటేనే మేము కొనుగోలు చేస్తామని పెండింగ్ పెట్టారు. అప్పటి నుండి నా భూమి ఆగిపోయింది. మూడేళ్ల నుండి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. ఎన్నో సార్లు ఆర్డీవో కార్యాలయం చుట్టూ, రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదు. సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో విడదల చేయటంతో మేలు జరిగింది.

పురిణి శ్రీరాములరెడ్డి: మోటుమాల

10 ఎకరాల సమస్య పరిష్కారం అయ్యింది



మా నాన్న, బాబాయలు కలుపుకుని కుటుంబ సమేతంగా 10 ఎకరాలు భూమి శాశ్వత పరిష్కారం అయ్యింది. ఎన్నో సంవత్సరాల నుంచి వెంటాడుతున్న సమస్యకు ఇప్పుడు పరిష్కారం దొరికింది. ఎంతో మంది పాలకులు మారినా ఈ ఆలోచన ఎవ్వరికి రాలేదు. సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డికు కృతజ్ఞతలు. దేశంలో ఇలాంటి చర్యలు తీసుకున్న నాయకులు మనకు కనిపించరు. నిత్యం ప్రజబల కోసం ఆలోచించే వ్యక్తి సీఎంగా కావడం మన అందరి అదృష్టం. ఇలాంటి సీఎం జగన్ మోహన్ రెడ్డిని అందరం కలిసి బలపరాచాలి.

గోపి: మోటుమాల సర్పంచ్

ఘనంగా ఎన్‌జీ రంగా వర్ధంతి వేడుకలు



ఎన్‌జీ రంగా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఆచార్య రంగా కిసాన్ సంస్థ నిర్వాహకులు

ఒంగోలు సబర్బన్: ఆచార్య ఎన్‌జీ రంగా 28వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పాత గుంటూరు రోడ్డులోని ఏఎంసీ వద్ద ఉన్న ఎన్‌జీ రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతపేటలోని రంగా కిసాన్ సంస్థ కళ్యాణ మండలంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అక్కడ కూడా ఎన్‌జీ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌జీ రంగా రైతాంగానికి చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో చుండూరు రంగారావు, చుంచు శేషయ్య, ఆళ్ళ వెంకటేశ్వరరావు, వడ్డె హనుమారెడ్డి, కామేపల్లి శ్రీనివాస రావు, ధూళిపాళ్ళ వీర నారాయణ, నాదెండ్ల చంద్రశేఖరరావు, గుండవరపు కోటేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

భూయజమాని సంతకం తొలగించాలి



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధా కృష్ణమూర్తి

నాగులుప్పలపాడు: కౌలు రైతు చట్టంలో భూయజమాని సంతకం అనే ప్రక్రియతో చాలా మంది అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రాక నష్టపోతున్నారని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి అన్నారు. కౌలు రైతు చట్టంలో భూ యజమాని సంతకం తొలగించాలని నెల్లూరు నుంచి చేపట్టిన జీపు జాత గురువారం మండల కేంద్రం నాగులుప్పలపాడుకు చేరింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె మాబు అధ్యక్షత వహించగా రాధా కృష్ణమూర్తి మాట్లాడుతూ కౌలు రైతుల సంక్షేమం కోసం కష్టపడి 2011లో సాధించకకున్న జీవోను 2019లో మోదీ అధికారంలోకి వచ్చాక దానిని నీరుగారుస్తున్నారన్నారు. ఇలాంటి ప్రక్రియ వలన చాలా మంది అర్హులైన కౌలు రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి వెంటనే కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని దుయ్యబట్టారు. రైతు సంఘం నాయకులు జయంత్ బాబు, లక్ష్మీపతి, శ్రీకాంత్, బసవపున్నయ్య, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: స్పందనకు వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్ హరిబాబు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో వివిధ శాఖలకు సంబంధించి 10 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీకి సంబంధించి గ్రామాల్లోకి వెళ్లి విచారించి పరిష్కరించాలన్నారు.

పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్‌లో రూ.25 లక్షలతో జరుగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. దేవాంగనగర్, టకారిపాలెం ప్రజలకు పైప్‌లైన్ ద్వార అన్ని వీధుల్లో కుళాయిలు ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించనున్నట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.25లక్షలతో జరుగుతున్న పైప్‌లైన్ పనుల్లో నాణ్యగా ప్రమాణాలు పాటించాలన్నారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్యునిటీ సెక్రటరీ షంషేర్, షరీఫుద్దీన్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

కందుకూరు రూరల్: మండలంలోని పాలూరు-దొండపాడు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పి.విజయశేఖర్ గురువారం పరిశీలించారు. గ్రామంలోని ప్రజలకు ఇచ్చే సర్వీసులు త్వరితగతిన అయ్యేలా పని చేయాలన్నారు. ఆలస్యం చేయకుండా ఏ అవసరం వచ్చినా వారి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా ఉద్యోగి ఉండాలన్నారు.

11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

వలేటివారిపాలెం: మండలంలోని చుండి ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఈ నెల 11న నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను 6వ తరగతిలో చేరేందుకు 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటల లోగా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

95 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండలంలో పెద్దగొల్లపల్లిలో ఇంటింటికీ వైద్య సేవల్లో భాగంగా గురువారం 95 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, 104 వైద్య సిబ్బంది మస్తాన్, డేవిడ్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోవాలి

కందుకూరు రూరల్: పెన్షన్‌దారులంతా విధిగా ఈ-కేవైసీ చేసుకోవాలని సహాయ ఖజానా అధికారి ఆర్.జగజ్జీవన్ తెలిపారు. రెండో శనివారం, ఆదివారం కూడా కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కందుకూరు పరిధిలో మొత్తం 2140 మంది పెన్షన్‌దారులు గాను 1710 మంది ఈ కేవైసీ నమోదు చేసుకున్నారని మిగిలిన 430 మంది కూడా చేయించుకోవాలన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఉలవపాడు: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథ పాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో గురువారం 58 మంది విద్యార్థులు పాల్గొనగా వారితో పుస్తక పఠనం చేయించారు. జాతీయనాయకుల చరిత్రలు, నీతికథలు చదివించారు. అనంతరం శారీరక వ్యాయామం కోసం ఖోఖో ఆటల పోటీలు నిర్వహించారు.

జాతీయ విద్యా విధానంపై తరగతులు

కందుకూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా విధానంపై జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు సదస్సులు నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాలయం ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ తెలిపారు. కందుకూరు కేంద్ర విద్యాలయంలో వర్చువల్ విధానంపై తరగతులు నిర్వహిస్తామన్నారు.

శుభకార్యాలకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్



చిన్నారులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు గురువారం రాత్రి పట్టణంలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ప్రముఖ హోమియో వైద్యుడు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా కుమారుని ఒడుగుల వేడుకలకు హాజరై ఆశీర్వదించారు. స్థానిక పుచ్చలమిట్టలో టీచర్ మస్తాన్ మక్కాకు వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మక్కా యాత్ర శుభంగా జరగాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూచేపల్లి అభిమానులు పాల్గొన్నారు.

దశ దిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే



మల్లవరంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నాయకులు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వైఎఎస్సార్ సీపీ నాయకులు చలంచర్ల కృష్ణారెడ్డి తల్లి లక్ష్మమ్మ దశ దిన కర్మ కార్యక్రమానికి సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు గురువారం మధ్యాహ్నం హాజరయ్యారు. లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో మాట్లాడుతూ పార్టీ పరంగా ఒక మంచి వ్యక్తి తల్లిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, గుడ్డపాతల రవి, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, దొడ్డవరం సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటేశ్వర్లు, జవ్వాజి లక్ష్మీ నారాయణరెడ్డి, పైనం ప్రభాకర్, ప్రసన్నకుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

వధూవరువులకు బాలినేని శుభాకాంక్షలు



బ్రహ్మారెడ్డి, కుసుమకుమారిలను ఆశీర్వదిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: ఆలూరు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చాగంటి కొండారెడ్డి, భార్య నాగమ్మ కుమారుడు బ్రహ్మారెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, నాగరాజకుమారి కుమార్తె కుసుమకుమారిలకు గురువారం వివాహం జరిగింది. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారికి అక్షింతలు వేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఆలూరు సర్పంచ్ పూనూరు మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వాతి, పల్లప్రోలు జానికిరామిరెడ్డి, శైలేష్, దొడ్ల రాజుగోపాల్‌రెడ్డి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులను అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడాప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.20 వేలను మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి అందించారు. రెండో బహుమతిని టెన్నిస్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రియ రూ.10 వేలను, మూడో బహుమతిని మద్దులూరు సర్పంచ్ మైనం శైలజ రూ.5 వేలను అందించారు. టెన్నిస్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ రవి, దుంపా ఇంద్రసేనారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సభ్యత్వ నమోదు పరిశీలన



వైఎస్సార్ బీమా నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుజాత

అల్లూరు (కొత్తపట్నం): వైఎస్సార్ బీమా సభ్యత నమోదు ప్రక్రియను అల్లూరులో గురువారం ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత పరిశీలించారు. ఎంత మంది కంప్లీట్ అయ్యాయి, ఎంత మంది మిగిలి ఉన్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అల్లూరు సచివాలయం పరిధిలో 707 కుటుంబాలు కాను 360 మందికి ఈకేవైసీ పూర్తి చేశామని, అల్లూరు-2 సచివాలయం పరిధిలో 1,031 గాను 520 చేయటం జరిగిందన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 15 పంచాయతీ పరిధిలో 15,950 వైఎస్సార్ బీమా నమోదయ్యాయని వీరంతా రెన్యువల్ చేసుకోవాల్సి ఉందన్నారు. అర్హత ఉన్నవారు 14వేల మందిని కొత్తగా 1,950 మందిని ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 7,500 మందికి రెవెన్యూ పూర్తి చేయటం జరిగిందన్నారు. ఈ నెల 9 సాయంత్రానికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పథకం ఉద్దేశించి దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు చెందిని కుటుంబ యజమాని 18-50 సంవత్సరాల్లోపు మరణిస్తే వైఎస్సార్ పథకం ద్వారా రూ.1 లక్ష పరిహారం అందిస్తారని చెప్పారు. 18-70 సంవత్సరాల మధ్య కుటుంబ సభ్యుడు మరణించినా, శాశ్వత అంగవైకల్యం చెందిన రూ.5 లక్షలు పరిహారం అందిస్తారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వైఎస్సార్ బీమా వలంటీర్లు ద్వారా చేయించుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ఐవీ రామారావు, హిమబిందు, వెల్ఫేర్ అసిస్టెంట్ రంగనాథ్, ఆశోక్, మహిళా పోలీస్ లాల్‌బి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న అధికారి

కనిగిరి రూరల్: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం వార్డు రెవెన్యూ, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, వాగు పొరంబోగు, చెరువు, కుంటలు తదితర ఆక్రమిత ప్రభుత్వ భూములను గుర్తించి తక్షణం నివేదిక ఇవ్వాలన్నారు. అనుమతి లేని, అక్రమ కట్టడాలను గుర్తించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సుకు 6 అర్జీలు

కందుకూరు రూరల్: మండలంలోని జి.మేకపాడులో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ డి.సీతారామయ్య తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఒక అర్జీ, మిగిలిన ఐదు అర్జీలు వెబ్ లాండ్ అడంగల్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని ఇచ్చారు. వీటిని పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ఆయా గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ రికార్డులను ప్రకారం సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు.